క్లుప్తంగా

కుష్టు నివారణపై అవగాహన ర్యాలీ



కుష్టువ్యాధిపై ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం కుష్టువ్యాధిపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ అనొకి మాట్లాడుతూ కుష్టు వ్యాధిలక్షణాలు, నివారణ చర్యలు, ప్రభుత్వం ద్వారా వీరికందించే చికిత్సల గురించి వివరించారు. కుష్టువ్యాధి పక్షోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా ఇంటింటి సర్వే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మధు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

కుప్పం: పట్టణంలో మునుస్వామి పురం బీసీ, ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ దుప్పట్లు, బెడ్లు పంపిణీ చేశారు. బీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహాలను ఆయన శుక్రవారం ఉదయం తనిఖీ చేపట్టారు. హాస్టల్స్‌లో మెనూ ప్రకారం భోజనాలు అందుతాన్నాయా లేదా అని ఆరా తీశారు. అనంతరం ఉదయం టిఫన్ విద్యార్థులతో కలసి భోజనం చేశారు. వర్షాలు కురుస్తుండటంతో విద్యార్థులకు చలిని తట్టుకునేందుకు దుప్పట్లు, బెడ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుప్పం మున్సిపల్ టీడీపీ అధ్యక్షులు రాజ్ కుమార్, మాజీ మార్కెట్ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, కౌన్సిలర్ దాము పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి




అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి మురళి

పెద్దపంజాణి: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధులను నివారించవచ్చని స్థానిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి. మురళి అన్నారు. మండలంలోని శంకర్రాయలపేట మహాత్మా జ్యోతిభా పూలే బాలికల పాఠశాల విద్యార్థినులకు శుక్రవారం వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆహారం తీసుకునే ముందు ప్రతిసారీ చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధుల గురించి వివరించారు. దగ్గు, జ్వరం, వాంతులు ఉంటే సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జ్యోత్స్న, సీహెచ్‌ఓ కరుణాకర్, ఎంఎల్‌హెచ్‌పీ జమున, ఏఎన్ఎం సుశీల పాల్గొన్నారు.

సంత గేటు వేలంతో రూ.లక్ష ఆదాయం

పెద్దపంజాణి: మండల కేంద్రంలో ప్రతి బుధవారం జరిగే వారపు సంత గేటు వసూలుకు నిర్వహించిన బహిరంగ వేలంలో రూ.లక్ష 14 వేల ఆదాయం సమకూరినట్లు పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం తెలిపారు. స్థానిక సచివాలయంలో శుక్రవారం సర్పంచ్ అఖిల ఆధ్వర్యంలో జరిగిన వేలం పాటలో పుంగనూరుకు చెందిన బాదుల్లా సంతగేటు వసూలును దక్కించుకున్నారన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌ఆర్డీ శారదా దేవి పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో మంగళ్‌పాండే జయంతి



మంగళ్‌పాండేకు నివాళులర్పిస్తున్న నేతలు

పలమనేరు: పట్టణ సమీపంలోని బీజేపీ కార్యాలయంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదంపై పోరాడిన యోధుడు మంగళ్‌పాండే 197వ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాతయ్య, సంజయ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

25న హుండీ లెక్కింపు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీలోని కానుకలను ఈ నెల 25వ తేదీన లెక్కిస్తున్నట్లు ఈవో వెంకటేశు తెలిపారు. 20 రోజులకు సంబంధించిన హుండీలోని కానుకలను ఉదయమే లెక్కిస్తామని, అధికారులు, సిబ్బంది తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

పలమనేరా..
దిగు దిగు..

- తిరుపతి– పలమనేరు ప్రయాణికుల అగచాట్లు
- డైరెక్ట్ టికెట్లుంటేే పలమనేరు నో స్టాపింగ్ అంటున్న కేఎస్ ఆర్టీసీ
- డైరెక్ట్ టికెట్లు లేకుంటే మాత్రం పలమనేరులోకి ఎంట్రీ

పలమనేరులో దిగుతామని ఓ కుటుంబం రాత్రి సమయంలో కేఎస్ ఆర్టీసీ కండక్టర్‌ను కోరింది. లేదండీ బెంగళూరు డైరెక్ట్ టికెట్లు మాత్రమే ఎక్కించుకుంటాం. ఏమైనా సీట్లు మిగిలితే అప్పుడు చూద్దాం లేదా వేరే బస్సులో పొండంటూ సమాధానం. ఇంత రాత్రిపూట ఇలా చేస్తే ఎట్టాసార్ అని ఆ కుటుంబం బతిమాలుకున్నా కనికరించలేదు.

– ఇదీ తిరుపతి నుంచి పలమనేరుకు వెళ్లే ప్రయాణికుల పరిస్థితి



సీట్లు ఖాళీగా ఉన్నప్పుడు పలమనేరు మీదుగా వెళుతున్న కేఎస్ ఆర్టీసీ బస్సు

పలమనేరు: కర్ణాటక ఆర్టీసీ బస్సులు పలమనేరు ప్రయాణికులను ఎక్కించుకోవడం లేదు. డైరెక్ట్ తిరుపతి– బెంగళూరు ప్రయాణికులకే ప్రాధాన్యత ఇస్తున్నాయి. బస్సులు ఖాళీగా ఉంటే మాత్రం పిలిచి మరీ ఎక్కించుకుంటాయి. ఇక బెంగళూరునుంచి పలమనేరుకు రావాలన్నా ఇదే దుస్థితి. బెంగళూరు టిన్ ఫ్యాక్టరీ, కేఆర్ పురం, హొసకోటలలో పలమనేరుకు వచ్చేవాళ్లు రోడ్లపై వేచి ఉండి బెంగళూరు నుంచి తిరుపతికి వచ్చే బస్సు ఎక్కే సమయంలో పలమనేరు అనగానే దిగు దిగు అంటూ కండక్టర్లు రైట్ రైట్ అనేస్తారు. పోనీ ఏపీఎస్ ఆర్టీసీ వస్తుందా అనుకుంటే బెంగళూరు– తిరుపతి మార్గంలో మన బస్సు గంటకు ఒకటి వస్తే కర్ణాటక బస్సులు పది వస్తుంటాయి. ఆఖరుకు బెంగళూరు డైరెక్ట్ ప్రయాణికులతో బస్సు నిండితే చిత్తూరు బస్టాండుకు కూడా ఆ బస్సులు వెళ్లకుండా బైపాస్‌ల మీదుగా వెళ్తుంటాయి. బెంగళూరు నుంచి రాత్రి పూట ఇదే పరిస్థితి. ప్రయాణికులు లేనపుడు కర్ణాటక బైపాస్ రైడర్లు సైతం పలమనేరు, చిత్తూరు రండీ రండీ అంటూ బతిమాలుకుంటారు. బస్సు నిండితే ఓ లెక్క, లేకుంటే మరో లెక్కలా ఉండి కర్ణాటక ఆర్టీసీ పరిస్థితి. ఇదే సమయంలో పలమనేరుకు ఆర్టీసీ బస్సులు తక్కువగా ఉండడం, పలమనేరు డిపోనుంచి కనీసం ఓ బస్సు కూడా బెంగళూరు– తిరుపతికి లేక ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది.

పలమనేరంటే అంత నిర్లక్ష్యమా?

తిరుపతి నుంచి నిత్యం పలమనేరుకు చాలామంది ప్రయాణికులు వస్తుంటారు. అదే విధంగా బెంగళూరునుంచి ఇక్కడి వచ్చేవారు ఉన్నారు. నిత్యం బెంగళూరులో పనులు చేసి వచ్చేవాళ్ళు, వారాంతపు సెలవుల్లో ఇక్కడికి వచ్చేవాళ్లున్నారు. ఈ మార్గంలో ఏపీకి చెందిన పలు హైటెక్ బస్సులు పలమనేరు పట్టణంలోకి రాకుండా బైపాస్‌మీద వెళుతుంటాయి. పట్టణంలోకి వచ్చే సర్వీసులు చాలా తక్కువ. అయితే కర్ణాటక ఆర్టీసీకి చెందిన వంద బస్సులు ఈ మార్గంలో వెళుతుంటాయి. ఇందులో పర్మిట్ కూడా లేని కేఎస్ ఆర్టీసీ బస్సులు ఉన్నట్టు స్థానిక ఆర్‌టీవో అధికారులకు సైతం తెలిసిన విషయమే. వీటిపై స్థానిక అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదో అంతుచిక్కడం లేదు. తిరుపతి బస్టాండులో బెంగళూరుకు బయలుదేరే కర్ణాటక ఆర్టీసీ బస్సు కండక్టర్లు పలమనేరు ప్రయాణికులను మాత్రం ఎక్కించుకోరు. నాన్ స్టాప్ బెంగళూరంటూ డైరెక్ట్ టిక్కెట్లను మాత్రం ఎక్కించుకుంటున్నారు. దీంతో పలమనేరుకు రావాలంటే చాలా కష్టంగా మారింది.

ఇటీవల ఎమ్మెల్యేకు విన్నవించిన పీపీఎస్

ఈ సమస్యపై గతంలోంచి పోరాడుతున్న పలమనేరు పరిరక్షణ సమితి నిర్వాహకులు ఇటీవల స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డికి సైతంవిన్నవించారు. దీనిపై ఆయన స్పందించి తగు చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. కానీ ఆర్టీసీ అధికారులను అడిగితే ఇదంతా జరిగే పనులు కాదనే సమాధానం వస్తోంది. దీనిపై మరింతగా ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

పది బస్సుల్లో అడిగా..



రెండ్రోజుల క్రితం తిరుపతి నుంచి పలమనేరుకు బయలదేరా. పలమనేరు వైపు వెళ్లే ఏపీఎస్ ఆర్టీసీ బస్సులు లేవు. కేఎస్ ఆర్టీసీ బస్సులు ఎక్కువగా కనిపించాయి. పది బస్సుల వద్దకెళ్లి కండక్టర్లను అడిగా పలమనేరని. అయితే వాళ్ళు ఎక్కించుకోలేదు. దీంతో వేలూరు బస్సులో చిత్తూరుకొచ్చి అక్కడినుంచి అర్ధరాత్రికి ఇంటికొచ్చా. డైరెక్ట్ టికెట్లు లేనప్పుడు మాత్రం పలమనేరుకొచ్చే కర్ణాటక బస్సులను పట్టణంలోకి రానివ్వకుండా ఆపేస్తేగాని వారికి బుద్ధి రాదేమో.

–నవీన్‌కుమార్, పలమనేరు

ఎన్నో ఏళ్లుగా ఇదే సమస్య



పలమనేరుకు రావాలంటే బెంగళూరునుంచి ఎక్కించుకోరు, తిరుపతి నుంచి రావాలన్నా బస్సుల్లో ఎక్కనివ్వరు. దీనిపై తాము పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించాం. కానీ ఎవరూ పట్టించుకోలేదు. పోనీ ఇక్కడి డిపోనుంచైనా బెంగళూరు– తిరుపతి సర్వీసులను నడపమన్నా నడపరు. ముఖ్యంగా కర్ణాటక బస్సుల కండక్టర్లకు పలమనేరంటే నిర్లక్ష్యమైంది. ఈ సమస్య పరిష్కారంపై ఇటీవల స్థానిక ఎమ్మెలే అమరనాథ రెడ్డికి సైతం పలమనేరు పరిరక్షణ సమితి విన్నవించింది.

–నరసింహులు, పీపీఎస్ కార్యదర్శి

నేడు మండల సమావేశం

పెద్దపంజాణి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 20వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ రెడ్డెప్ప అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్ రహీమ్ తెలిపారు. దీనికి అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికతో హాజరు కావాలన్నారు.

నిల్వ ఉన్న నీటిలోనే లార్వా వృద్ధి



పట్టణంలోని ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

పలమనేరు: నిల్వ ఉన్న నీటిలోనే లార్వాపెరిగి ఆపై దోమలు, దాని ద్వారా పలు రకాల వ్యాధులకు కారణమవుతోందని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఆ మేరకు ప్రభుత్వ ఆదేశాలతో పట్టణంలో శుక్రవారం డ్రై డే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. మున్సిపల్ హెల్త్ సిబ్బందితో కలసి పట్టణంలోని పలు సంక్షేమ హాస్టళ్లలో నీటి సంపులను గుర్తించి, అందులో నీటి నాణ్యత పరీక్షలను చేపట్టారు. గాంధీనగర్, కాకాతోపు, ఎద్దులసంత వీధుల్లో పలు ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని కింద పారబోశారు. వర్షాకాలం కాబట్టి నీటిని కాచి వడకట్టి తాగాలని సూచించారు. ఇందులో ఏఈ రూపేష్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అడుగులు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి

గంగవరం: గ్రామీణ ప్రాంతాల్లో సమస్యల పరిష్కార దిశగా అడుగులు వేయాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ వెంకటరమణ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు తమ సచివాలయాల పరిధిలో నెలకొన్న సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఎంపీడీవో మాట్లాడుతూ వర్షాల దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామాల్లో పారిశుధ్యం పడకేసిందని చెప్పారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులను ఆదేశించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఈ సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంలా కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక కావాలన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ, తాగునీటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వాటిని ముందుగా పరిష్కరించినప్పుడే మనం ప్రజాప్రతినిధులుగా చలామణి అవుతామన్నారు. గ్రామీణ ప్రజానీకానికి ఎలాంటి సమస్య తలెత్తినా ముందుండి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. జెడ్పీటీసీ పార్వతి, తహసీల్దార్ లోకేశ్వర్‌రావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయండి



మండల మీట్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ రోజా



క్లోరినేషన్ పద్ధతిని చూపుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీత్

పలమనేరు: పలమనేరు మండల అభివృద్ధికి అధికారులు మరింత కృషి చేయాలని ఎంపీపీ రోజా పేర్కొన్నారు. ఎంపీపీ రోజా అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో ప్రజలకు అందుతున్న సేవలపై సంబంధిత శాఖల అధికారులు ప్రజాప్రతినిధులకు విపులంగా వివరించాలని సూచించారు. దీంతోపాటు పథకాలు లబ్ధిదారులకు తంతునుగా అందేలా చూడాలన్నారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యురాలు మల్లిక మాట్లాడుతూ మండలంలో రేషన్ డీలర్లకు అందుతున్న బియ్యం తక్కువగా వస్తోందని తెలిపారు. ఇందుకు తహసీల్దార్ రంగనాయకులు సమాధానం ఇస్తూ గత కోటాలో నిల్వ ఉన్న రేషన్‌ను తీసేసి కొత్త స్టాకును పంపుతున్నారని తెలిపారు. రేషన్ షాపుల్లో చక్కెర, కందిపప్పు ఇవ్వడంలేదని సభ్యులు తెలపడంతో స్టాక్ రాలేదని ఆయన సమాధానం ఇచ్చారు. ధరలను అదుపులో ఉంచాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో కొన్ని చోట్ల ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సరుకులు విక్రయించే కౌంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు.

గత ప్రభుత్వంలో మంజూరై పెండింగ్‌లో ఉన్న ఇళ్ల విషయం ఏంటని మొరం సర్పంచ్ విశ్వనాథ రెడ్డి ప్రశ్నించారు. వాటికి ఈ ప్రభుత్వంలోనూ త్వరలో బిల్లులవుతాయని హౌసింగ్ అధికారి సమాధానం తెలిపారు. గంటావూరు, ఎంపీ కోటూరులో కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం త్వరలో చేపట్టనున్నట్లు టౌన్ ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. గతంలో పల్లెల్లోని ఇళ్లకిస్తున్న త్రీ ఫ్యూజ్ స్థానంలో 24 గంటల కరెంట్ సరఫరా కార్యక్రమాన్ని ఆర్‌టీపీఎస్ స్కీమ్‌లో చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. కౌండిన్య నదిలో దెబ్బతిన్న చెక్ డ్యామ్‌ల మరమ్మతులకు రూ.4కోట్ల అంచనాలను సిద్ధం చేశామని, గంగమ్మ శిరస్సు ప్రాజెక్టు కోసం పెంచిన అంచనాలతో ప్రభుత్వానికి డీపీఆర్ సిద్ధం చేశామని స్థానిక ఇరిగేషన్ అధికారి జయలక్ష్మి తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా ఏఈ వినీత్ మాట్లాడుతూ ప్రస్తుతం ఓవర్‌హెడ్ ట్యాంకుల నుంచి ట్యాప్‌లకు వెళ్లే మెయిన్ పైప్ వద్ద క్లోరినేషన్ చేస్తే రోగాలకు చెక్ పెట్టినట్టేన్నారు. ఈ విధానాన్ని ఎలా చేయాలో ప్రజాప్రతినిధులకు అర్థమయ్యేలా ప్రయోగాత్మకంగా చేసి చూపెట్టారు. అనంతరం ఆయా శాఖలకు చెందిన అధికారులు వారు అమలు చేస్తున్న పథకాలపై వివరించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు జయశ్రీ, గజేంద్ర, ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేష్తోపాటు పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మాలల హక్కుల కోసం ఉద్యమిద్దాం




సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్, మాల మహానాడు నాయకులు

చౌడేపల్లె: మాలల సంక్షేమంతోపాటు హక్కుల కోసం ఉద్యమిద్దామని మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు జి.మనోహర్, అధికార ప్రతినిధి మల్లెల మోహన్ పిలుపునిచ్చారు. వారు శుక్రవారం స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో సమావేశం నిర్వహించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల్లో కేటాయించిన పథకాలు అందించాలన్న డిమాండ్‌తో ఈ నెల 22న తిరుపతి యూత్ హాస్టల్‌లో తల పెట్టిన సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మాలలకు అందాల్సిన నిధులు, పథకాల అమలుకోసం భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై సమావేశంలో చర్చించనున్నట్లు చెప్పారు. గ్రామ స్థాయి నుంచి యువత హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు రమణ, కూరపర్తి ఈశ్వర్, సుబ్రమణ్యం, రాజేంద్ర, శేఖర్, శ్రీరాములు, వెంకటరమణ, సురేష్, అంజి, ముకుందా, రెడ్డిప్రసాద్, రామచంద్ర, హరీష్ వేణు, తదితరులున్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

కుప్పం: బాలురు ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సాయిమాత సేవా ట్రస్టు వ్యవస్థాపకులు జగదీష్ బాబు తెలిపారు. బెంగళూరు శంకర్ కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ శిబిరంలో కంటి చికిత్సతోపాటు కంటిలోని శుక్లానికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయనున్నట్లు వివరించారు.

2 వేల మందికి అన్నప్రసాదం





ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, తీర్థప్రసాదాలు అందుకుంటున్న మాజీ చైర్మన్‌లు రమణారెడ్డి, రతీదేవి

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం సుమారు 2 వేల మందికి అన్నదానం చేశారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసి అమ్మవారి గర్భాలయానికి మామిడి, వేపాకు, రంగు రంగు పూలతోరణాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. ఆలయ ఉప కమిషనర్ జె.ఏకాంబరం ఆధ్వర్యంలో రాహుకాల అభిషేక పూజలు చేశారు. ఆషాఢ మాసం సందర్భంగా వివిధ ప్రాంతాలనుంచి భక్తులు, ఉభయదారులు తరలివచ్చారు. భక్తుల రద్దీతో ఆలయం కిటకిటలాడింది. ఉభయదారులచే అమ్మవారికి యాగశాలలో కొలువురిన అమ్మవారి ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌లు ఎస్‌కె. రమణారెడ్డి, రతీదేవి ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం అధికారులు తీర్థప్రసాదాలను అందజేసి అమ్మవారి శేషవస్త్రం అందించి వేదపండితులచే ఆశీర్వచనం చేయించారు. ఉభయదారులకు అమ్మవారి అభిషేకం పసుపు, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆలయం వద్ద ఉచిత అన్నప్రసాదం

బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద భక్తులకు సౌకర్యంగా ఏర్పాటుచేసిన ఉచిత అన్నప్రసాద కేంద్రం వద్ద శుక్రవారం ఆలయ ఉప కమిషనర్ ఏకాంబరం పర్యవేక్షణలో సుమారు 2 వేల మందికి అన్నప్రసాదం ఏర్పాటుచేసి వారే వడ్డించారు. అన్నప్రసాదం నిర్వహణకు బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్లు ఎస్‌కె.రమణారెడ్డి, రతీదేవి దంపతులు ఆర్థిక సహాయం చేశారు. దాతలు సహకరించాలని ఈఓ కోరారు.

నిర్లక్ష్యం చేస్తే కౌండిన్యలో ఇసుక ఖాళీ



కౌండిన్య నదిలో ఇసుక తవ్వకాలపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్న ప్రజాప్రతినిధులు

పలమనేరు: పలమనేరు మండలంలోని కౌండిన్య నదిలో టీడీపీ నాయకులు ఇసుక అక్రమరవాణా పెచ్చుమీరిందని దీనిపై చర్యలు తీసుకోకుంటే నెల రోజుల్లో నదిలోని ఇసుక మొత్తం ఖాళీ అవుతుందని ఎంపీపీ రోజా, జెడ్పీటీసీ మల్లిక, వైస్ ఎంపీపీలు జయశ్రీ, గజేంద్రతోపాటు సర్పంచులు, ఎంపీటీసీలు లిఖితపూర్వకంగా తహసీల్దార్ రంగనాయకులకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ పెంగరగుంట పంచాయతీలోని కౌండిన్య నదిలో నిత్యం జేసీబీల ద్వారా నదిలోని ఇసుకను టీడీపీ వాళ్లు తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తమతోపాటు అధికారులు వస్తే రెడ్ హ్యాండెడ్‌గా ఇసుకను తోడి దాచేస్తున్న డంపులను చూపెడతామన్నారు. కౌండిన్య నదిపక్కనే ఉన్న సేటు, గణేష్, ధనమ్మ పొలాల వద్ద ఉన్న ఇసుక నిల్వల ఫొటోలను అధికారులకు చూపెట్టారు. ఈ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తుంటే ఇక్కడ ట్రాక్టర్ ఇసుక రూ.4వేలకు ఎలా అమ్ముడవుతోందని ప్రశ్నించారు. ట్రాక్టర్లపై టీడీపీ ముద్ర వేసుకొని అక్రమాలకు దిగారని చెప్పారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ రంగనాయకులు సెబ్ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. మీరు పట్టించుకోకుంటే ఆందోళనలు తప్పవని ప్రజాప్రతినిధులు హెచ్చరించారు. ఇందులో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలాజీనాయుడు, సర్పంచుల సంఘం అధ్యక్షులు విశ్వనాథ రెడ్డి, రాజారెడ్డి, కుప్పయ్య, మునస్వామి తదితరులున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

పట్టణ సమీపంలోని క్యాటిల్‌ఫామ్ వద్ద కౌండిన్య నదిలో జేసీబీ వాహనంతో ఇసుకను తోడి ట్రాక్టర్లలో తరలిస్తున్నారనే సమాచారంతో స్థానిక సెబ్ సీఐ సురేష్‌రెడ్డి తమ సిబ్బందితో కలసి రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. అక్కడ ఇసుక తరలిస్తున్న టీడీపీ నాయకులు సీఎం చంద్రబాబు మాట్లాడిన వీడియోను సీఐకి చూపెట్టారు. వాగుల్లో, వంకల్లో ఇసుక తోలుకోమని సీఎం చెప్పారన్నారు. ఇసుకను తోడి అమ్ముకోమని దాని అర్థంకాదని చట్టం మేరకు తాము చర్యలు తీసుకుంటున్నామని ఆయన సమాధానం ఇచ్చారు. ఉచితంగా ఇసుక అంటే ప్రభుత్వం నిర్ణయించి డంప్‌లో సీనరీస్ చార్జీలను చెల్లించి పొందాలేగానీ ఎవరి ఇష్టానుసారంగా వారు ఇసును తరలించి అమ్ముకోవడం కాదన్నారు.





పెంగరగుంట పంచాయతీలో కౌండిన్య నది పక్కన ఇసుక డంపులు, కౌండిన్య నదిలో ఇసుకాసురులను హెచ్చరిస్తున్న సెబ్ సీఐ సురేష్‌రెడ్డి

ట్రాఫిక్ సమస్య పరిష్కరించండి



మార్కెట్ సమస్యలను ఎమ్మెల్యేకు వివరిస్తున్న మండీ యజమానులు

పలమనేరు: స్థానిక మార్కెట్‌లో బయటి వ్యాపారులు రాక టమాట ధరలు తక్కువగా ఉన్నాయంటూ రైతులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో మండీ వ్యాపారులు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని కలిసి అక్కడి పరిస్థితిని వివరించారు. వారు మాట్లాడుతూ మార్కెట్‌లో స్థలం చిన్నదిగా ఉండడం మండీలు ఎక్కువగా ఉండడంతో దారి ఇరుగ్గా ఉందని చెప్పారు. ఈ మార్గంలో కంటైనర్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. దీంతో బయటి రాష్ట్రాలనుంచి వ్యాపారులు రావడం లేదని పేర్కొన్నారు. ఇలాంటి సమస్యలుంటాయనే పట్టణ సమీపంలోని క్యాటిల్‌ఫామ్ వద్ద 33 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ టమాటా మార్కెట్‌ను తీసుకొచ్చామని ఈ పనులను వెంటనే చేపట్టేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే వారికి తెలిపారు. అంతవరకు రైతులకు అన్ని మార్కెట్ల మాదిరిగానే ధరలుండేలా చూడాలని సూచించారు. ఇందులో మండీ యజమానులు మండీసుధా, రవి, సుబ్రమణ్యం నాయుడు, శంకర్ తదితరులున్నారు.